# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 17 మే , 2026 | పేజీలు : 08




2

## మిల్లుల్లో ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలి

ఎస్‌పి కె.నరసింహ్మా



# 2028లో బిసిలు అధికారం చేపట్టడం ఖాయం

### జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** 2028లో బిసిలు తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఖాయమని, తెలంగాణ గడ్డ బిసిలకు అడ్డాగా మారిందని ఈ సునామీని ఎవరూ ఆపలేరని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాధికారం లక్ష్యంగా బిసి సమాజంలో రాజకీయ చైతన్యం పెరిగిందన్నారు. పిడికెడు శాతం ఉన్న వారి పాలన ఇంకెన్నాళ్ళని ఆయన ప్రశ్నించారు. బిసిలు బలమైన శక్తిగా ఎదిగారని ఇక అగ్రకులాల ఆటలు సాగవన్నారు. 2034 వరకు రేవంత్ రెడ్డి సిఎంగా కొనసాగుతానని అంటున్నాడని, బిఆర్ఎస్‌లో కూడా సార్ రావాలి ముఖ్యమంత్రి కావాలని ప్రగల్భాలు పలుకుతున్నారని, పదేళ్ల పరిపాలన సరిపోదా అని ఎద్దేవా చేశారు. సింహభాగం ఉన్న బిసిలను పాలకులుగా కాకుం డా పాలితులుగా జెండాలు మోసేవారిగా, ఓట్లు వేసే యంత్రాలుగా అణిచివేస్తున్నారని ఆక్షేపించారు. జూలై 12న హైదరాబాద్‌లో బిసిల రాజకీయ ప్లీనరీ, ఆగష్టు 7న జాతీయ ఓబిసి సమావేశం, సెప్టెంబర్‌లో బిసిల రాజ్యాధికార రథయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలలు పల్లె నుంచి పట్టణం వరకు రాజకీయ దామాషా రాజ్యాధికారమే లక్ష్యంగా కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌లో డిసెంబర్‌లో 10 లక్షల మందితో రాజకీయ యుద్ధభేరిని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలు సత్తా చాటి అగ్రకులాల్లో వణుకు పుట్టించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూర మల్సూర్ గౌడ్, జాజుల లింగం గౌడ్, ఉప్పల మధు యాదవ్, బెల్లంకొండ రామ్మూర్తి గౌడ్, చల్లమల్ల నర్సింహ, నిద్ర సంపత్ నాయుడు, బెల్లంకొండ సైదులు పాల్గొన్నారు.




# ఇంధన ధరల పెంపుపై మునుగోడులో సిపిఐ నిరసన

**ప్రజాపక్షం/మునుగోడు:** పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై భారం మోపుతున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో మునుగోడు అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు.ఎన్నికల ముందు ధరలు పెంచబోమని చెప్పి, తర్వాత పెంచి మోసం చేస్తున్నారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం మండిపడ్డారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు ఇక్కడ ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపారి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య, మహిళా సమాఖ్య కార్యదర్శి మాధగోని సత్యమ్మ, మాజీ జెడ్‌పిటిసి గోసుకొండ లింగయ్య, మండ ల కార్యవర్గ సభ్యులు ఉప్పునుతుల రమేష్, దుబ్బ వెంకన్న, బెల్లం శివయ్య, ఈదులకంటి కైలాస్, వనం వెంకన్న, ఎం.పరమేష్, కురుమర్తి ముత్తయ్య, కొండ కృష్ణ, బైరుగొండ వెంకన్న, ఎన్.అశోక్, బండారు శంకర్, కట్ట దశరథ, తదితరులు పాల్గొన్నారు.

## మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



2

## కలెక్టరేట్ ముందు రైతుల ఆందోళన



2

## యాదాద్రి కొండపై దుకాణాల దందాకు చెక్ పెట్టాలి!



వివరాలు మెయిన్‌లో

# కలెక్టరేట్ ముందు రైతుల ఆందోళన

ప్రజాపక్షం/రామన్నపేట : మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన ధాన్యాన్ని 50 రోజులుగా కొనుగోలు చేయక పోవడంతో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం రైతులు కలెక్టరేట్ ఎదుట శనివారం వినూత్న నిరసన చేపట్టారు. గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఆధ్వర్యంలో రైతులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోసి ఆందోళనకు దిగారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలు చేస్తూ తమ గోడును వినిపించారు. తక్షణమే కాంటాలు వేసి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కొనుగోలు ఆలస్యమవడంతో ధాన్యం నాణ్యత దెబ్బతింటోందని, ఆర్థికంగా తీవ్ర నష్టాలు వస్తున్నాయని వాపోయారు. రైతుల నిరసనతో కలెక్టరేట్ వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాపక్షం/మిర్యాలగూడ: అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియ సాఫీగా సాగాలంటే ప్రభుత్వ శాఖలు, రైస్ మిల్లర్లు, లారీ యాజమాన్యాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 6.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి విజయవంతంగా కొనుగోలు చేశామని, ఇంకా 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి మిల్లర్లు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేయాలని హుకుం జారీ చేశారు. రోజుకు కనీసం 400 లారీలను ఖాళీ చేసేలా లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. హమాలీల సమస్య వస్తే దూర ప్రాంతాల నుంచి తీసుకురావాలని, ఖాళీ అయిన ఐకేపీ సెంటర్ల హమాలీల సేవలను కూడా వాడుకోవాలన్నారు. అన్‌లోడింగ్ కాగానే ట్రక్ షీట్లను తీసుకెళ్లాలని, లారీ ట్యాగింగ్ ఇబ్బందులను అధికారులు స్పాట్‌లోనే క్లియర్ చేయాలన్నారు. రవాణా సజావుగా సాగడానికి మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అదనంగా 50లారీలను సమకూర్చాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలపై స్పందించిన రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి వందశాతం సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్‌వో వెంకటేష్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, పౌర సరఫరాల డీఎం రాంపతినాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, మిల్లర్లు శ్రీనివాస్, బాబి, నవీన్, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

## మిల్లుల్లో ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : మిల్లుల్లో వరి ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని జిల్లా ఎస్‌పి కె.నరసింహ మిల్లర్లను కోరారు. శనివారం జనగామ రోడ్డులో ఉన్న వజ్రారైస్ మిల్ నందు వరి ధాన్యం దిగుమతులను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట దిగుమతి బాగా వచ్చిందని, రైతులు అకాల వర్షాల వల్ల నష్టపోకుండా ప్రతి ఒక్క మిల్లరు బాధ్యత తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన వరి ధాన్యాన్ని వాహనాల నుండి త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని మిల్లు యజమానులకు సూచించారు. రైతుల పక్షాన బాధ్యత తీసుకొని వారికి అండగా నిలువాలని కోరారు. మిల్లు యజమానులతో, మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి ధాన్యం దిగుమతి వివరాలు తెలుసుకున్నారు. వరి ధాన్యాన్ని తరలించడానికి లారీ యజమానులు డ్రైవర్లు సహకరించాలన్నారు. పండిన పంట వర్షంలో తడవకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలని అవసరమైన టార్పాలీన్లు, పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రం నుండి ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ బాలు నాయక్, మిల్లు నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చండూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

### మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

### మన ప్రాంతం మన బాధ్యత పేరుతో బ్రోచర్ విడుదల

ప్రజాపక్షం/చండూరు: చండూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ పాలకవర్గం, మున్సిపల్ కమిషనర్ మల్లేశంతో కలిసి 10 అంశాలతో కూడుకున్న మన ప్రాంతం మన బాధ్యత అనే బ్రోచర్లను మున్సిపాలిటీ కార్యాలయం నందు విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మన ఇంటి నుండి ప్రారంభమైన చిన్నచిన్న అడుగులు మున్సిపాలిటీకి పెద్ద మార్పు అవుతుందని అన్నారు. ప్రజలందరూ బాధ్యతతో మెలగాలని చండూరు పరిశుభ్రత మరియు అభివృద్ధికై 10 అంశాలను ఈ బ్రోచర్లో వివరించామని తెలిపారు. చండూరు అభివృద్ధికై మున్సిపాలిటీలోని ప్రజలందరూ సహకరించాలని కోరారు. మెయిన్ రోడ్డు మీద ఫ్లెక్సీలు ఉండకూడదని రోడ్డుకిరువైపులా డ్రైనేజీకి బయటి భాగాల్లోనే ఫ్లెక్సీలుపెట్టాలని తెలిపారు. మెయిన్ రోడ్లపై చెత్తను పోయరాదని చెత్తబుట్టలను వాడి మున్సిపాలిటీ చెత్తను సేకరించే వాహనాలు వచ్చినప్పుడు వేయాలని కోరారు.మున్సిపాలిటీ పరిధిలో పందులు ఉండకుండా చర్యలు ప్రారంభమయ్యాయని, పెంపకం దారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ,కమిషనర్ మల్లేశం, కౌన్సిలర్లు తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్, బుషిపాక వాసు, సామ సుజాత యాదవ రెడ్డి, జెల్ల ధనమ్మ శ్రీనివాసులు, కె మధు, కోడి సుష్మా వెంకన్న, కలిమికొండ పరిజాత జనార్ధన్, కటకం రమేష్, కోఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, ఖలీల్, మొగుదాల సత్తమ్మ వెంకన్న, సలీమ షరీఫ్, సాయిరాం, అరవింద్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది



ప్రజాపక్షం/కోదాడ రూరల్ : ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను నట్టేట ముంచిందని బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన మండలంలోని అల్వాలపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకైనా రూ.2లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో చేశారా అని ప్రశ్నించారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలపై ఎక్కడైన చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. రుణమాఫీ కాకపోవడం వల్ల బ్యాంకుల అప్పులు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్త రుణాలు రాక ప్రైవేటీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మామిడి తోట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి అశోక్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెలివోలు చిట్టిబాబు, సీనియర్ నాయకులు కనగాల వెంకటరామయ్య, బొలిశెటిట కృష్ణయ్య, కనగాల నారాయణ, యర్రపల్లి రామారావు, వెంకటనర్సయ్య, గోదేశి లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

## ధరలు ఎందుకు పెంచారో సమాధానం చెప్పాలి




సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు దూళిపాళ్ల ధనుంజయ నాయుడు

ప్రజాపక్షం/నేరేడుచర్ల : దేశంలో సరిపడా పెట్రోల్ నిల్వలు ఉన్నాయని పెట్రోల్, డిజిల్ ధరలు ఎందుకు పెంచారో మోడీ, అమిత్‌షాలు సమాధానం చెప్పాలని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు దూళిపాళ్ల ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ ఆధ్వర్యంలో నేరేడుచర్ల తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్, డిజిల్ ధరల పెంపును నిరసిస్తూ కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన పెట్రోలియం ధరల వలన రవాణా చార్జీలు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులపై భారం పడి విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన మొదలు ఈనాటి వరకు రైతులను, వ్యవసాయ కార్మికులను, పారిశ్రామిక కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తయారు చేసి కార్మికులను అరిగోస పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తూ ఆ పథకాన్ని నీరుగార్చేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. ఇలా అన్ని రంగాల ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్న బిజెపి అంతు చూసేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రావుల సత్యం, చిలక రాజు శ్రీను, ఏ. లక్ష్మి, ఊదర వెంకన్న, కొమ్మరాజు వెంకట్, పరికె భరత్, బత్తిని శ్రీనివాస్, ఆర్ గురునాథం పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యం



ప్రజాపక్షం/నడిగూడెం : గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని గ్రామ సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలంలోని వల్లాపురం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి ఆమె మాట్లాడారు. గ్రామాన్ని మండలంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి రోజు గ్రామంలో ప్రతి వీధిని సందర్శిస్తామని గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజల ద్వారా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాభివృద్ధికి కావల్సిన పనులను సీనియర్ కాంగ్రెస్ నాయకులు వల్లపురెడ్డి సురేందర్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి కిన్నెర నాగయ్య, ఉపసర్పంచ్ కోట చంద్రశేఖర్ రెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దల సహకారంతో నెరవేరుస్తామన్నారు.

## ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు

ప్రజాపక్షం/చివ్వెంల : యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పిడి సన్యాసయ్య ఆదేశించారు. శనివారం సాయంత్రం మండలంలోని ఐలాపురం, తర్మీయా తండ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో నిర్వహిస్తున్న తూకాలు, రిజిష్టర్లు, తేమ శాతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం అకాల వర్షాల ముప్పు ఉన్నందున, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా లారీల రవాణాను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద టార్పాలిన్లు, గన్నీ బ్యాగుల



కొరత లేకుండా చూసుకోవాలన్నారు. రైతులకు తాగునీరు, నీడ సదుపాయం కల్పించాలని సూచించారు. కాటా అయిన వెంటనే ఆన్‌లైన్‌లో ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసి, రైతులకు సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పిడి సురేష్, రైతులు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధికి సహకరించాలి

ప్రజాపక్షం/నడిగూడెం : గ్రామ సమగ్రాభివృద్ధికి గ్రామస్తులందరూ సహకారం అందించాలని గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. శనివారం నడిగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరిగిన పాలక వర్గ సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో మంచి నీటి సౌకర్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.సమావేశంలో ఉపసర్పంచ్ ఎల్లారి నాగరాజు, పంచాయితీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు దున్నా శ్రీకాంత్, దున్నా లింగయ్య, దున్నా మనీషాప్రదీప్, పోలెబోయిన విజయ నాగరాజు, నాగవరపు సరస్వతి రాము, గుండు మహేందర్ ప్రసాద్ పాల్గొన్నారు.



## ప్రగతి బాటలో ప్రభుత్వ విద్యాలయాలు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రభుత్వ విద్యాలయాలు ప్రగతిబాటలో నడుస్తున్నాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అవంతీపురం కేజీబీవీలో ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. విద్యార్థుల రక్షణే ధ్యేయంగా కేజీబీవీలో రక్షణ గోడ నిర్మిస్తున్నామన్నారు. నేటి సమాజంలో విద్యే నిజమైన ఆస్తి అని ప్రభుత్వం కల్పిస్తున్న అద్భుతమైన అవకాశాలను వాడుకోని విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈఓ శైలజ, ఎంఈవో ధర్మానాయక్, సుజాత సురేష్, శ్రీనివాస్, ఎస్‌వో పార్వతి తదితరులు ఉన్నారు.



## రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిరసన



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని మూసి ఒడ్డు తండ గ్రామస్తులు శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ కుమార్ గ్రామస్తులతో కలిసి రోడ్డును పరిశీలించి మాట్లాడుతూ ఏడాది క్రితం రోడ్డు వేస్తామని, ఉన్న రోడ్డును తవ్వి కంకర పరచి వదిలేశారన్నారు. ఈ ప్రాంత గిరిజనులు కంకర తేలిన రోడ్డుపై నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యంతోనే రోడ్డు నిర్మాణం పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మరో రెండు సంవత్సరాలలో ఈ రాష్ట్రానికి పట్టిన పీడ వదిలిపోతుందన్నారు. రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవులాల్ శివనాయక్, కిషన్, పద్మ, శారద, సైదానాయక్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం అభినందనీయం



**ప్రజాపక్షం/అనంతగిరి :** గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారం అభినందనీయమని అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని బొజ్జగూడెం తండ, అమీనాబాద్, అజీమ్రర తండకు వెళ్ళే జంక్షన్ వద్ద హైమాక్స్ లైట్లను ప్రారంభించారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి డ్రైనేజీ నిర్మాణం కొరకు ఉపసర్పంచ్ భూక్య నాగమణి రవి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కొండ ఉపేందర్, మాజీ సర్పంచ్ గుగులోతు పంతులు, మాజీ వైస్ ఎంపిపి ధరావత్ రామా, వార్డు మెంబర్లు పానుగోతు రాధాకృష్ణ, మండన్ హరిప్రసాద్, గుగులోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధరల పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్న కేంద్రం




**ప్రజాపక్షం/చండూరు/గట్టుప్పల :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను పెంచుతూ సామాన్య ,మద్య తరగతి ప్రజల నడ్డి విరుస్తొందని సిపిఐ మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్ అన్నారు. సిపిఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం గట్టుప్పల మండల కేంద్రంలో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించి పాత ధరలను పురరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు రాపోలు సత్తయ్య, ఐతరాజు లక్ష్మయ్య, కారింగు శ్రీను, దుబ్బాక రాములు, కట్ట చెన్నయ్య, బాలెం లింగయ్య, సుధాకర్ రెడ్డి, కొండపల్లి ముత్యాలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్, సిఎన్జీ ధరలను తగ్గించాలి

### ప్రజలపై మోదీ ప్రభుత్వ భారాలను వ్యతిరేకించండి..

### సిపిఎం, సిపిఐ పార్టీల రాస్తారోకో



**ప్రజాపక్షం/వలిగొండ :** బిజెపి నేతృత్వంలో కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ పై 339, డీజిల్ పై 327, సిఎన్జి పై 2 రూపాయలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో శనివారం వలిగొండ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలో దేశంలో కొనసాగుతున్న కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, సిఎన్జి, వంట గ్యాస్ పై పెంచిన ధరలను ప్రజలందరూ వ్యతిరేకించాలని వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన అనంతరం పెట్రోల్, డీజిల్, ధరల్ని పెంచడం మోడీ ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు నిదర్శనం అనాన్రు. ఇప్పటికే 14 కిలోల వంట గ్యాస్ పై 60 రూపాయల అదనపు భారం పడుతుందని మరోవైపు ఈ ధరల పెరుగుదల సామాన్యులు నడ్డి విరిచే విధంగా ఉంద న్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్య్ర కమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటే శం,సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, సిపి ఎం మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం, సిపిఐ పట్టణ కార్యదర్శి సల్వాద్రి రవీందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, సిపిఎం, సిపిఐ పట్టణ నాయకులు శీలం ఇందిర, కొండూరు సత్తయ్య, వేముల లక్ష్మయ్య, చొప్పరి వెంకటేశం, మైసోల్ల నరేందర్, యాదయ్య, గుండెగాని నాగ రాజు, ఎల్లంకి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దగ్ధం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి




**ప్రజాపక్షం/నల్లగొండ :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలోని సుభాస్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పబ్బు వీరస్వామి మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం భారీ పన్నులు విధిస్తూ ప్రజలను దోచుకుంటోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, సహాయ కార్యదర్శి విశ్వనాథుల లెనిన్, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, సిపిఐ సీనియర్ నాయకులు ముండ్ల ముత్యాలు, ఎస్‌కె మధార్, బాసాని వెంకటయ్య, చిత్రం యాదగిరి, పుట్టల సుజాత, జగన్, సర్దార్, గునా నారాయణ, ఎం.నందం, ఆర్.సీతారాములు, చాంద్ పాషా, వలికి వెంకటేశం, పంజాల నరసింహా, కందికట్టి ఎల్లయ్య, ఓర్పు అంగయ్య, అంజయ్య, జె.విజయ, మద్దిమడుగు పార్వతమ్మ, చిత్రం రజిత, మాధవి, రాములమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మహాధర్నాను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మే 26న హైదరాబాద్‌లో జరిగే గిరిజన మహా ధర్నాను విజయవంతం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య రాజు నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఛలో ఇందిరాపార్కు గిరిజన మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగమైన చేవెళ్ల డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన తండాల అభివృద్ధి కోసం ప్రతి గ్రామ పంచాయితీకి సంవత్సరానికి రూ.25 లక్షల నిధులు ఇస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను గిరిజన సంక్షేమ శాఖ ఖాతాలో జమ చేసి, పెండింగ్ నిధులను విడుదల చేయాలన్నారు. తండాలను గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేయించడంలో గిరిజన పోరాట సమితి కీలక పాత్ర పోషించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన ప్రజలు, , కార్యకర్తలు పెద్ద ఎత్తున మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంగోతు శ్రీకాంత్ నాయక్, గుగులోతు రమేష్ నాయక్, ధరావత్ శ్రీరామ్ నాయక్, అశోక్ నాయక్, భావిక్ నాయక్, హార్దిక్ నాయక్, నాగు నాయక్ పాల్గొన్నారు.

# ధరల మోతతో పేదల జీవితాలు దుర్భరం

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** కేంద్ర పెంచిన పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరల మోతతో పేదల జీవితాలు దుర్భరంగా మారాయని, సామాన్య పేద ప్రజల ప్రయోజనాలను కాపాడడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సామాన్యుల జీవితాల్లో కష్టాలు మొదలయ్యాయన్నారు. కార్పోరేట్ సంస్థలకు వేలకోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ, అప్పులను రద్దు చేస్తూ పేదలకు సంబంధించి నిత్యవసరాలైన గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను పెంచడం వలన జీవించలేని పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. సామాన్యులకు, పేదలకు మేలు జరిగేలా ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, సోమగాని కృష్ణ, యల్లావుల రమేష్, చెన్నగాని సైదులు, ఇందిరాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, యల్లావుల శివ, అమరారపు పున్నయ్య, బత్తిని మల్లయ్య, వీరయ్య, కొట్టు మహన్ రావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## చమురు ధరలకు నిరసనగా రాస్తారోకో



**ప్రజాపక్షం/చిట్యాల :** పెంచిన చమురు ధరలకు నిరసనగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో చమురు ధరలు పెంచమని చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు ముగియగానే ధరలు పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపారని విమర్శించారు. దేశంలో చమురు నిక్షేపాలను వెలికితీయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. చమురు కంపెనీలకు దాసోహం కాకుండా వెంటనే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీతపనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, సిపిఐ మండల కార్యదర్శి ఎండి అక్బర్, నాయకులు దేశగాని బాలరాజు, బొలుగూరు లింగయ్య, షేక్ షరీఫ్, పసుల దేవేందర్, షేక్ నజీర్, ఏళ్ళ రవి, జోగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**ప్రజాపక్షం/మునగాల :** డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం అనే నినాదంతో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ వినయ్ కుమార్ సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ డే సందర్భంగా శనివారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రేపాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వైరస్ వ్యాధిని హాని కలిగించే ఎడిస్ ఇజాప్టై (టైగర్) దోమ మన ఇంటి పరిసరాలలో చిన్న చిన్న పాత్రలలో స్థావరం ఏర్పాటు చేసుకొని పగటిపూట కుట్టడం జరుగుతుందని తెలిపారు. వారానికి ఒక సారి ఇంటి పరిసరాల్లో లార్వా (తోక పురుగులు) లేకుండా చేసుకోవాలని, దోమ తెరలను వాడాలని, కిటికిలకు జాలీలు బిగించాలని, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సునీత, శాంతయ్య, ఫణీంద్ర, ఆశాలు జ్యోతి, రమణ పాల్గొన్నారు.

## ఘనంగా అమావాస్య అన్నదానం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** అమావాస్య సందర్భంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి సేవా కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కమిటి సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో గత 19 నెలల నుండి ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుమారు 700 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. సహకరిస్తున్న దాతలకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాచకొండ శ్రీనివాసరావు, ఉట్కూరి నటరాజ్, కొత్త లక్ష్మణ్, కందిబండ శ్రీనివాసరావు, పొలిశెట్టి వెంకటేశ్వర్లు, భువనగిరి అంజయ్య, గుండా సత్యనారాయణ, జగిని సురేష్ పాల్గొన్నారు.

## ఎన్యుమరేటర్లకు ప్రతి ఒక్కరు సహకరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణములో జరిగే జనగణన కార్యక్రమానికి వచ్చేటువంటి ఎన్యుమరేటర్లకు ప్రతి ఒక్కరు సహకరించి తమ వివరాలు తెలుపాలని సెన్సెస్ చార్జ్ ఆఫీసర్, మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి తెలిపారు. శనివారం పట్టణములో సర్వే జరుగుతున్న తీరును ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకొని ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి జరుగుతున్న జనగణన అని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో జనగణనకు సుమారు 267 మంది ఎన్యుమరేటర్లు, 43 మంది సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారని, వీరందరూ 48 వార్డుల్లో విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. జనగణనలో తొలుత భవనాలు, కుటుంబాలు, ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీలింగ్ అసిస్టెంట్ గోపారపు రాజు, సూపర్‌వైజర్లు సుధీర్ రెడ్డి, శ్రీనివాస్, ఎన్యుమరేటర్ దేవిరెడ్డి ఉమ పాల్గొన్నారు.

## డెంగీ నివారణపై అవగాహన అవసరం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** డెంగ్యూ నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డాక్టర్ బి. నగేష్ అన్నారు. శనివారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమతెరలు వాడాలని, కిటికిలకు జాలీలు బిగించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచునాయక్, సూపర్ వైజర్ లలిత, సిబ్బంది కలమ్మ, అనూష, మహేష్ పాల్గొన్నారు.

## సామాన్యులపై పెనుభారం

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై పెనుభారం మోపిందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆటోను తాడుతో లాగి నిరసన తెలిపి రాస్తోరోకో నిర్వహించారు. ఇంధన ధరలను పెంచడం వల్ల నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కృంగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, మల్యాల రాములు, సోమేష్, గోపగాని శ్రీనివాస్, గుండగాని లక్ష్మయ్య, మల్లేష్, సింహాద్రి పాల్గొన్నారు.

## వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలి



**ప్రజాపక్షం/చండూరు :** భూగర్భ జలాల పెంపుదల వర్షపు నీటిని సంరక్షించుకోవాలి అనే నినాదంతో జలశక్తి అబియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం చండూరు మండలంలోని బోడింగిపర్తి , తాస్కానిగూడెం, పుల్లెంల, ఇడికూడ, శిర్ధపల్లి గ్రామాలలో ఎంపిడిఓ బండారు యాదగిరి, ఏపిఓ శ్రీనివాస్, వేముల పుష్పా వీరేశం ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వార ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఏర్పాటు చేసిన సభలలో కళాజాత బృంద సభ్యులు తమ ఆటపాటలు సాంస్కృతిక ప్రదర్శనల ద్వార నీటి సంరక్షణ, వర్షపు నీటి సంరక్షణ వర్షపు నీటి నిల్వ పద్ధతులు. ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు సులభంగా అర్ధమయ్యే విధంగా చైతన్య పరుస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బండారు యాదగిరి పుల్లెంల గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ భూగర్బ జలాల పెంపుదల ,వర్షపు నీటిని సంరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. జలశక్తి అభియాన్ ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి వర్షపు నీరు వృదా కాకుండా ఇంకుడు గుంతలు నిర్మాణాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని ప్రజలకు తెలియజేశారు. గ్రామాలలో పచ్చదనం ,పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణపై పంచాయితీ పాలక వర్గాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుల్లెంల సర్పంచ్ ముక్కాలం వెంకన్న యాదవ్, ఇడికూడ సర్పంచ్ పాల్వాయి రమాదేవి శ్రవన్ కుమార్, బోడంగిపర్తి సర్పంచ్ బొమ్మల సుగుణ, తాస్కానిగూడెం సర్పంచ్ కొండా రజిత, శిర్ధపల్లి సర్పంచ్ దామెర రాములు, డిఆర్డిఏ డిపి సోమయ్య, ఏపిఎం యాదయ్య, ఎంపిఓ కోటి, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ , పెట్రోల్ ,డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి



**ప్రజాపక్షం/చండూరు:** పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం చండూరు మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ చండూరు మండల సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య మాట్లాడుతూ గ్యాస్ ,పెట్రోల్ ,డీజిల్ ధరలు పెరగడం సామాన్య ప్రజలపై మోయలేనంత భారం పడుతుందని అన్నారు. తక్షణమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెరిగిన ధరలను తగగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, జెల్ల శ్రీను, సిహెచ్ ఊషయ్య, గంట రమేష్, ఇర్గి సంజీవ, పల్లె శంకరయ్య, శివర్ల లింగస్వామి, దోటి యాదయ్య, కాశిమల్ల శ్రీను, ఇర్గి బాలరాజు, ఏఐవైఎఫ్ ,ఎస్ఎఫ్ నాయకులు గడ్డం నవీన్, ఇర్గి ప్రవీన్, కరుపాటి పరమేష్ , కొండ్రెడ్డి సాయి, పల్లె మల్లేశం తదితరులు పాల్గొన్నారు

## ముమ్మరంగా బడిబాట ప్రచారం




**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం మండలంలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా శనివారం మండలంలోని మహ్మదాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎండలను సైతం లెక్కచేయకుండా ఇంటింటికి వెళ్ళి ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, కంప్యూటర్ ఆధారిత విద్య, నైతిక విలువల పెంపు, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతుల నిర్వహణ వంటి అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. పదవ తరగతి ఫలితాల్లో మండల టాపర్లను తయారు చేసేలా సబ్జెక్టులపై పూర్తి పట్టున్న ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ, అనుభవం కలిగిన ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణే తమ పాఠశాల ప్రత్యేకత అని తెలిపారు. తమ పాఠశాలపై నమ్మకంతో శనివారం ఒక్కరోజే 4 కొత్త అడ్మిషన్లు జరిగినట్లు ఉపాధ్యాయులు ప్రకటించారు. ఈ కార్యక్రమలో హింది ఉపాధ్యాయులు జి. ఆనంద భాస్కర్, తెలుగు ఉపాధ్యాయులు బి. కృష్ణయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు కృత్రిమ మేధపట్ల అవగాహన



**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను ఆరవ రోజు ఘనంగా నిర్వ హించడం జరిగింది. శనివారం విద్యార్థులకు కృత్రిమ మేధపట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కృత్రిమ మేధ పాత్ర నేటి సమాజంలో ఎంతో ప్రాధాన్యతను సంతరించు కున్నదని, భవిష్యత్తులో కృత్రిమమేధ నైపుణ్యాన్ని కలిగిన వారికే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఐబిఎ ం.కన్సల్టెన్సీలు సాయి రాఘవేంద్ర, లక్ష్మీ ప్రసన్న, సోమ నాథ్ గారలచే కృత్రిమ మేధ పరిజ్ఞానం పట్ల విద్యార్థులకు చక్కని అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్య్ర కమంలో అకడమిక్ కోఆర్డినేటర్ మరియు ప్రోగ్రాం ఇం ఛార్జి డాక్టర్ జె.చిన్నబాబు, సభ్యులు డాక్టర్ ఎం.రవీందర్ రావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, పరిపాలనాధికారి జి.కరుణాకర్, అధ్యాపకులు డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, ఎం.అనిత,డాక్టర్ డి.కిషన్, డాక్టర్ ఎం.ర వీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, టి.శ్రీనివాస్, జె.న రేశ్, రవి, ఆంజనేయులుతో పాటు కార్యాలయ సిబ్బంది శ్రీదేవి, నాగరాజు, నవీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐని సన్మానించిన డా.జేరిపోతుల పరశురామ్



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రానికి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శోభన్‌బాబును కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డా.జేరిపోతుల పరశురామ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, నాగార్జున, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోదీ




**ప్రజాపక్షం/డిండి :** పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి డమాండ్ చేశారు. శనివారం డిండి మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు కంటే ముందు మన దేశంలో ఎలాంటి పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదని ప్రచారాలలో హంగు ఆర్భాటాలు చేసి ప్రసంగాలలో చెప్పిన ప్రధానమంత్రి మోడీ ఎన్నికలు అయిపోయిన కొన్నిరోజులకే పెట్రోల్, డిజిల్, గ్యాస్ పెంచి దేశంలోని ప్రజలందరిని మోసం చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ డిండి మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కేశవులు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు లింగమయ్య, సిపిఐ గోనకోల్ గ్రామ శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తవక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి చక్రి, గోవర్ధన్, ప్రవీణ్, నాగరాజు, గంగయ్య, లింగస్వామి, లక్ష్మయ్య, వెంకటయ్య, నిరంజన్, శ్రీఖన, లింగయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి




**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాళ్లు రామలింగమ్మ, గంగారపు సైదమ్మలు డిమాండ్ చేశారు. శనివారం గడ్డిపల్లి గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడైన బండి భగీరథ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడి వారం రోజులు అవుతున్నా నేటికి అతన్ని అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలతో చట్టం ఉన్న వాడికి చుట్టం అనేది తేటతెల్లమవుతుందని విమర్శించారు. ఆర్థిక బలం, అధికార బలం కలిగిన వారు తప్పు చేస్తే ఒక విధానం సామాన్యులు తప్పుచేస్తే మరొక విధానం అవలంభించడం సరైన విధానం కాదన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పజెప్పకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకొని తప్పించుకు తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు నాగమణి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

## స్ట్రీట్ లైట్లు పంపిణీ



**ప్రజాపక్షం/మోటకొండూర్ :**మోటకొండూరు మండలంలోని ఆబిద్ నగర్‌లో స్ట్రీట్ కాస్ స్వచ్ఛంద సంస్థ టీం లీడర్ సాత్విక ఆధ్వర్యంలో 15 సోలార్ లైట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాత్విక మాట్లాడుతూ గ్రామాలలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని అమరావతి రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉమేష్, నర్సిరెడ్డి, రవీందర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## జన్మదిన సందర్భంగా చలివేంద్రం

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :**గట్టుసింగారం గ్రామ ఉప సర్పంచ్ చెరుకు నరసింహ జన్మదినాన్ని పురస్కరించుకుని గట్టుసింగారం మానాయికుంట ఎక్స్ రోడ్డులో చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు, ప్రజలకు చల్లని తాగునీరు అందించే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గట్టుసింగారం సర్పంచ్, మానాయికుంట సర్పంచ్, గట్టుసింగారం గ్రామ పాలక వర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విద్యార్థి నాయకులు మరియు గ్రామ ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ చెరుకు నరసింహకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

## దత్తాయపల్లిలో జనగణన సర్వే



**ప్రజాపక్షం/తుర్కపల్లి :**మండలంలోని దత్తాయిపల్లి గ్రామంలో శనివారం జనగణన సర్వేను నిర్వహించారు. ఉపాధ్యాయులు కొంతం వెంకటరెడ్డి,సూపర్వైజర్‌గా జి శ్రీధర్ న్యూమరేటరీగా జనగణన సర్వే నిర్వహించారు. క్లస్టర్ పరిధిలోని సిఆర్‌పి వీరస్వామి, బడిబాట కార్యక్రమాలు ఇంటింటికి పెళ్లి సర్వేలో భాగంగా ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్నటువంటి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్నటువంటి సదుపాయాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విధంగా గ్రామస్తులు అవగాహన కల్పించారు.

## విద్యా వారోత్సవాల్లో తుర్కపల్లి విద్యార్థినికి అభినందన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** విద్యా వారోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో క్రీడారంగంలో జాతీయస్థాయిలో ఆడిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామానికి చెందిన ఏయముల అంజలి మోడల్ స్కూల్, కాలేజ్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ సీఇసీ చదువుతు, వాలీబాల్ స్కూల్ గేమ్స్ అండర్ 19 విభాగంలో జాతీయస్థాయిలో పాల్గొన్న సందర్భంగా ఈరోజు విద్యా వారోత్సవాల్లో విద్యార్థిని అభినందించినట్లు తెలిపారు. మధ్యప్రదేశ్ లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో కూడా పాల్గొన్నదని ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లె రమేష్ రెడ్డిని శాలువతో అభినందించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికార పార్టీ నాయకుల అక్రమాలను అరికట్టాలి



**ప్రజాపక్షం/బీబీనగర్:** దాన్యం కొనుగోలు కేంద్రాలలో అధికార పార్టీ నాయకుల అక్రమాలను అరికట్టాలని గ్రామ సర్పంచ్ కో మీరే శ్రీకాంత్ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్ విమర్శించారు. శనివారం మండలంలోని చిన్న రావులపల్లి గ్రామంలో పీఏసీఎస్ సెంటర్‌లో ధాన్యం మేచర్ వేయకుండా తమ ఇష్టానుసారంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగల్ విండో వైస్ చైర్మన్ చేస్తున్న దౌర్జన్యాలను పై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గత 20 రోజుల నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రాశులు పోసుకొని రైతులు నానా అవస్థలు పడుతుంటే ప్రభుత్వం అధికారులు పట్టించుకోవడం లేదని కేవలం అధికార పార్టీ అండతో పిఏసిఎస్ సెంటర్లకు ధాన్యం తరలించి తూకం వేసి ఏ గ్రేడ్గా ధాన్యాన్ని రైస్ మిల్లు తరలించిన తర్వాత బి గ్రేడ్ గా మారుస్తున్నారని పార్టీ నేతలకు ప్రత్యేక నిబంధనలు ఉంటాయని రైతులను బెదిరిస్తున్నారని వారు తెచ్చిన ధాన్యాన్ని మే చర్ చెక్ చేయకుండా మిల్లుకు తరలిస్తున్నారని రైతులందరికీ ఒకేలా న్యాయం జరగాలని నిలదీసిన సర్పంచ్ పైన దుర్భాషలాడి దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. అంతేకాకుండారైతులందరికీ సమన్యాయం జరగాలని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల అశోక్, రైతులు జి.పురుషోత్తం రెడ్డి శ్రీశైలం సోమ రమేష్ గుర్రం బాల్రెడ్డి పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



**ప్రజాపక్షం/రామన్నపేట :** మార్కెట్లలో ధాన్యం పోసి 2 నెలలు దాటిన ధాన్యం కొనుగోలు చేయట్లేదని యాదాద్రి భువనగిరిజిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని రైతు సంఘాలు పిలుపుమేరకు ఇంద్రపాల నగరం రైతుల ఆధ్వర్యంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్, ఎడ్ల మహాలింగం బయలుదేరి రామన్నపేటకు వచ్చిన క్రమంలో పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కలెక్టరేట్ వద్ద 11:30కు ధర్నా చేయాలని రైతు సంఘాల పిలుపుమేరకు భువనగిరికి బయలుదేరుతున్న క్రమంలో పోలీసులు ఫోన్ లొకేషన్ ట్రాక్ చేసి రామన్నపేట పిఎస్ మెయిన్ రోడ్డు వద్ద ఎస్సై నాగరాజు వారి బృందంతో కలిసి అరెస్టు చేశారు. సాయంత్రం 6 గంటలకు విడుదల చేశారు. ఈ క్రమంలో రైతు సంఘం నాయకులకు పోలీసులకు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లలో ధాన్యం బోసి నెలలు గడుస్తున్న కొనకపోవడంతో వర్షాలతో ధాన్యం తడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, హమాలి వాళ్లను లారీలను పెద్ద మొత్తంలో అందుబాటులో ఉంచాలని రైస్ ధాన్యం స్టోరేజ్ కి గిడ్డంగులను ఏర్పాటు చేయాలని,మిల్లుల దోపిడిని అరికట్టాలని, సీజ్ చేయాలని, కాంట వేసిన 24 గంటల్లో రైతులకు డబ్బులు వేయాలని, అవినీతికి పాల్పడుతున్న అధికారులను తీసివేయాలని,ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పి రైతులను అరిగోసలు పెడుతుంది.అధికారంలోకి రాగానే రైతు డిక్లరేషన్ ఇంప్లిమెంట్ చేస్తామని చెప్పి దాన్ని ఊసే లేదు. రైతు బంధుకు మంగళం పలికి, రైతు కూలీల మాటే లేదు, రైతే రాజు చేస్తామని చెప్పి రైతులపైనే రాజకీయం చేస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్తాం అన్నారు.

## జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి

### టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలో టియుడబ్ల్యూజె ( ఐ జే యు ) సభ్యత్వ నమోదు ముమ్మరంగా కొనసాగుతుంది. జిల్లాలోని అన్ని మండలాలలో, పట్టణాలలో, నియోజకవర్గ కేంద్రాలు,జిల్లా కేంద్రంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. అన్ని ప్రధాన పత్రికలతో పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, చిన్న పత్రికల ఎడిటర్లు,రిపోర్టర్లు,ఫోటో జర్నలిస్టులు వీడియో జర్నలిస్టులు పెద్ద ఎత్తున సభ్యత్వాలను పొందుతున్నారు.ఈ సందర్భంగా నల్లగొండలో శనివారం సాయంత్రం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలోటియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల హక్కులను కాపాడుకోవడంతో పాటు,ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం,ఇంటి నిర్మాణం,హెల్త్ కార్డుల వంటి సౌకర్యాలను కల్పించడం కోసం టి యుడబ్ల్యూజే కృషి చేస్తుందని తెలిపారు.ఉమ్మడి రాష్ట్రం తో పాటు,ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా యూనియన్ నిరంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి జర్నలిస్టు కు యూనియన్ అండగా నిలుస్తుందని,అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ అందించటానికి కృషి చేస్తామని అన్నారు.ఈకార్యక్రమంలో సంఘము బాధ్యులు అబ్బోజు మదనా చారి,పులిమామిడి మహేందర్ రెడ్డి,పిట్టల రామ కృష్ణ,దోటి శ్రీనివాస్,పొట్టు ముత్తు అశోక్,కే.జగదీశ్వర చారి,కత్తుల యాదగిరి, మహమ్మద్ గౌస్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :**మండలంలోని మైలారం కింది తండలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యంజాల కళ ఆధ్వర్యంలో నూతన మహిళా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షురాలు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షురాలుగా ధారావత్ బుజ్జి, ఉపాధ్యక్షురాలుగా ధారావత్ కౌసల్య, జనరల్ సెక్రెటరీగా ధీరావత్ రమ్య, బూతు అధ్యక్షురాలిగా రామవత్ అనిత, కార్యదర్శులుగా ధీరావత్ లక్ష్మి , సహాయ కార్యదర్శి కవిత, కోశాధికారిగా శారదలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల మహిళా అధ్యక్షురాలు యంజాల కళా మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ పార్టీని మండలంలో అగ్రస్థానంలో నిలపడమే తన లక్ష్యమని మహిళలను గౌరవించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోటేష్, ఉప సర్పంచ్ రాకేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జీవుల యూత్ కాంగ్రెస్ మండల జనరల్ సెక్రెటరీ ధరావత్ ఘాజియామ్ హరి శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటుకు స్వాగతం



**ప్రజాపక్షం/రామన్నపేట :**కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో హామీల అమలులో భాగంగా ఈ కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయ మని రామన్నపేట మం డల అధ్యక్షులు నోముల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేశవరావును చైర్మన్‌గా, పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కొదండరాం, అద్దంకి దయాకర్, ఎస్.రాములు నాయక్, మోతే శో భన్ రెడ్డి సభ్యులుగా నియమించడం ద్వారా ఉద్యమకారుల గుర్తింపుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు చీమ శ్రీనివాస్‌కి మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె చాంద్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామన్నపే ట మండల ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, రాష్ట్ర నాయకులు రెబ్బాసు రాములు, ఉద్యమ నాయకులు రామన్నపేట మాజీ ఉపసర్పంచ్ గంగాపురం యాదయ్య, ఉద్యమ నాయకులు గొలుసుల ప్ర సాద్, యాదాసు లక్ష్మ ణ్, కైరంకొండ సంతోష్, పెండం రవీందర్ పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన పూస బాలకిషన్

**ప్రజాపక్షం/రామన్నపేట :**రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ పిఎసిఎస్ మార్కెట్ను సందర్శించి, స్వయంగా కాంట తూకం పరిశీలించారు. హామలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, ప్రస్తుతం ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని తగుసూచనలు చేశారు. అనంతరం పిఎసిఎస్ సిబ్బందిని అడిగి కొనుగోలు ప్రక్రియపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మార్కెట్లో మొత్తం 7,399.60 క్వింటాళ్ల ధాన్యం, 18,499 బస్తాల కొనుగోలు విజయవంతంగా పూర్తైనట్లు అధికారులకు తెలిపారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐ ధర్నా



**ప్రజాపక్షం/చింతపల్లి :** కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ నిత్యవసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు శనివారం మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ పై విపరీతంగా ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రతీ ఎన్నికల్లో ప్రజలను నమ్మిస్తూ ఆ వెంటనే రేట్లు పెంచుతూ మోసం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, మండల కార్యవర్గ సభ్యులు వేముల బుచ్చయ్య, వింజమూరి నరసింహ, యాచారం శ్రీశైలం, ఇస్లావత్ పాప, కుర్మేటి కృష్ణయ్య, ఎస్కే శంశుద్దీన్, రామకృష్ణ, జితేంద్ర, సైదులు. బాల మల్లేష్, క్రిస్టోఫర్, దశరథం, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని చౌటుప్పల్ ఎన్‌హెచ్ 65 రోడ్డుపై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిపిఐ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ రేట్లను పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా నిత్యవసర వస్తువుల ధరలను కూడా తగ్గించి పేద ప్రజలకు భారం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉడుత రామలింగం, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, దాసరి మనోహర్ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బిజెపి జాతీయ కిసాన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు.శనివారం మండలంలోని తాటికల్లు గ్రామంలో గల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి గోనె సంచులు, లారీల కొరత విపరీతంగా ఉందన్నారు. లారీలను సకాలంలో కేంద్రాలకు పంపించి ధాన్యాన్ని తరలించాలని కోరారు.ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చ కోశాధికారి కన్మంత రెడ్డి అశోక్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు చెనగని రాములు, మండల ప్రధాన కార్యదర్శి బండమీది శ్రీకాంత్, వార్డు సభ్యులు అనిల్ కుమార్, సాగర్ల శ్రవణ్, రైతులు పాల్గొన్నారు.

# వెంకులు మృతికి ఘన నివాళి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కల్లేపెల్లి చిన్న వెంకులు మృతికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఘన నివాళులు అర్పించారు.ఆయన మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించి దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈకార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింత పున్నమయ్య,ఎలిజాల నాగరాజు,కోవే యాదగిరి,చింత శ్రీకాంత్,కల్లేపెల్లి రామకృష్ణ,పెద్ద యాదగిరి,ఇస్తారి,శ్రీను,ప్రమోద్,చింతమళ్ల వెంకన్న, పరశురాములు,గోవర్ధన్ పాల్గొన్నారు.

# వడ్ల పేరుతో రాజకీయం తగదు

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి

**ప్రజాపక్షం/రామన్నపేట :** మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో వడ్ల పేరుతో బిఆర్ఎస్ రాజకీయం చేస్తుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము వడ్లు పోసుకున్న స్థలం వద్దే ముందు కొనుగోలు చేయాలని పంతం పట్టుకుందని, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం నుండి గ్రామ ప్రాంతంలోని నాయకుల వరకు అందరిదీ ఒకే రకమైన అరాచకం అని.ప్రభుత్వం ఏ పని చేసిన, ఏ అభివృద్ధి చేసిన అడ్డుకోవడం రాజకీయ చేయడం పరిపాటిగా మారిందని,అందులో భాగంగానే రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరంలో కూడా వడ్లతో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయం చేస్తూ గ్రామ రైతులను, అధికారులను గందరగోళంలో పెడుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. రామన్నపేట మండలంలో అత్యధికంగా వరిసాగు చేసే కొన్ని గ్రామాలలో ఇంద్రపాలనగరం ఒకటి. వరి దిగుబడికి తగ్గట్టుగానే గ్రామంలో ప్రభు త్వం,అధికారులు ఐకెపి,పిఎసిఎస్ ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సాఫీగా కొనుగోలను నిర్వహిస్తున్నారు.ఆ గ్రామ సర్పంచ్,బిఆర్ఎస్ నాయకులు రైతులకు ఇబ్బంది కలగకుండా అధికారులకు సహకరించాల్సింది పోయి ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. కావాలని ఎమ్మెల్యే వేముల వీరేశంను, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రాజకీయ కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. కావాలని ఎమ్మెల్యేను, ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. రైతులకు మేలు చెయ్యకపోగా బిఆర్ఎస్ నాయకులు రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు. టిఆర్ఎస్ పార్టీ నాయకులు అరాచకాలు ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెబుతామని,ఎమ్మెల్యేను బదనం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/రామన్నపేట :** వామపక్షాల సుదీర్ఘ పోరాట ఫలితంగా అమలులోకి వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం కాకుండా ఉండాలంటే ఉద్యమించాల్సిందేనని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కందుల హనుమంతు, మేడి ముకుంద అన్నారు. శనివారం రామన్నపేట మండలంలోని బోగారం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి జిల్లామహాసభలకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సుదీర్ఘకాలంగా ఎన్నో పోరాటాలు నడపడం వల్ల వామపక్షాల మద్దతుతో వచ్చిందని దీనికి ప్రధాన కారణం పేదరిక నిర్మూలన కోసం కుటుంబానికి ఆర్థిక భరోసాను కల్పించే ఈ చట్టాన్ని నేడు కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తూ వచ్చిన నిధులను పక్కదారి మల్లిస్తూ రానురాను ఈ చట్టాన్ని లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. ఈనెల 18 రామన్నపేట మండల కేంద్రంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు ఆల్ ఇండియా కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట రాములు హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామకమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులుగా కూనూరు జయమ్మ, కునూరు సరితలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు నేరటి రమాదేవి,బద్దుల ఐలమ్మ,బైకాని సుశీల,కూనూరు అంజమ్మ,గోగు లలిత,కడారి సువర్ణ,మేడి లావణ్య,మేడి నీలమ్మ,బైకాని శ్రీరాములు,సింగం సత్యనారాయణ,గోగు అంజయ్య, గుంజే సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో కృత్రిమ మేధస్సుపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో కృత్రిమ మేధస్సు మీద అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అత్యంత వేగంగా దూసుకుపోతున్న ఆధునిక సాంకేతికతలపై విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కల్పించడమే ఈ ప్రదర్శన యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. దీనికి ప్రముఖ లీగల్ ప్రాక్టీషనర్ సిద్దేశ్వర్ రావు,కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఎస్ పి వెంకటరమణ,టిఎస్‌కెసి మెంటార్ ఎండితౌసిఫ్,ఆంగ్ల విభాగం అధ్యక్షులు డాక్టర్ వై వి ఆర్ ప్రసన్నకుమార్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహారించారని తెలిపారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ నిత్యజీవితంలో వీటి




ప్రాధాన్యత, పనితీరును వివరించారు. భవిష్యత్తులో డేటా సైన్స్ చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫసర్ అం తటి శ్రీనివాసులు,పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి. మునిస్వామి,అధ్యాపకులు జె. నాగరాజు,డాక్టర్ వెల్దండి శ్రీధర్, కోటయ్య,డాక్టర్ ఎ.మల్లేశం, లెఫ్టినెంట్ సుధాకర్, డాక్టర్ అనిల్ బొజ్జ, ఎం. శ్రీనివాస్ రెడ్డి ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతిక రంగంలో గొప్ప విప్లవం

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** కృత్రిమ మేధస్సు ఆధునిక సాంకేతిక రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని, దీని ద్వారా క్లిష్టమైన విషయాలను సులభంగా అర్థం చేసుకోవచ్చని, అవసరమైన సమాచారాన్ని వేగంగా సేకరించి, పరిశోధన పనిని సులభతరం చేస్తుందని కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మల్లిరెడ్డి భీమార్జున రెడ్డి పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మిర్యాలగూడలో విద్యా వారోత్సవాల 6 వ రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమంలో కళాశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు పై ‘‘ఐబిఎమ్” వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం అంతర్జాలంలో (వర్చువల్ సమావేశం) నిర్వహించబడిం ది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆలోచనలు, నివేదికల రూపకల్పన, ప్రెజెంటేషన్ తయారీలో కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుందని, విద్య,వైద్యం, వ్యవసాయం, బ్యా ంకింగ్, పరిశ్రమలు వంటి అనేక రంగాలలో దీని వినియోగం వేగంగా పెరుగుతోందని వివరించారు. అలాగే కృత్రిమ మేధస్సు వినియోగంలో నైతిక విలువలు పాటించడం, సమాచార భద్రతపై అవగాహన కలిగి ఉండడం అవసరమని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ధరల పెంపుతో ప్రజలపై భారం మోపుతున్న కేంద్రం

**ప్రజాపక్షం/మర్రిగూడ :** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి కేంద్ర బీజేపీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్ విమర్శించారు. ఎన్నికల ముందు ధరలు పెంచమని చెప్పి, తర్వాత పెంచి మోసం చేశారని ఆరోపించారు. క్రూడ్ ఆయిల్ తగ్గినా ఇక్కడ తగ్గించకపోవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదలు, కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి,మండల కార్యవర్గ సభ్యులు ఎరుకల నిరంజన్,జక్కల అంజయ్య,కొట్టాల సర్పంచ్ కలయిక లింగయ్య,అయితే గూనివెంకటయ్య,జిల్లా బాలకృష్ణ,వల్లం యాదయ్య,ఎండి నజీర్,వేముల సత్తయ్య, గుండెబోయిన శీను,రామారావు,నాటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాస్‌లో ఉల్లాసంగా నేర్పించాలి

**ప్రజాపక్షం/హాలియా :** మెప్మా ఆధ్వర్యంలో అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో నిరక్షరాస్యులను,సమస్యలతో బాధపడే మహిళలకు రక్షణ కల్పించడమే ఈఉల్లాస్ కార్యక్రమం అని దానిని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని హాలియా మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం హాలియా మున్సిపాలిటీ కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్,ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షులకు,ఓబి మెంబర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి కమిషనర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ చదువురాని వారికి చదువు చెప్పి చదవడం, రాయడం, అంకెలను గుర్తించడం తదితర అంశాలను నేర్పించడమే ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు.నిరక్షరాస్యులై, సమస్యలతో బాధపడే మహిళలకు రక్షణ కల్పించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని చెప్పారు.మహిళ సాధికారితలో భాగంగా 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయసు గల మహిళలకు అక్షరజ్ఞానం అందించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉల్లాస్ కార్యక్రమంలో ఉల్లాసంగా నేర్పించాలని తెలిపారు.ఈకార్యక్రమంలో మెప్మా టిఎంసి పద్మ,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ డెంగీ దినోత్సవ అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/మర్రిగూడ :** జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.డెంగ్యూ పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల వ్యాప్తిని అరికట్టాలని సిబ్బందిని ఆయన కోరారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి జాతీయ డెంగ్యూ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి,దేవరకొండ ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాహుల్, డాక్టర్ దీప, డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ నగేష్,పీహెచ్‌సీ వైద్యాధికారులు,డాక్టర్ శాలిని, డాక్టర్ దీపక్,సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.

# కూలీలకు మంచినీటి సరఫరా



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని నోముల గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం తాగునీటిని సరఫరా చేశారు.ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ పొట్టబత్తుల జయమ్మ వెంకటేశం మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడం వల్ల ఎండలు తీవ్రంగా ఉన్నాయని,కూలీలు ఎండదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తగా పంచాయతీ తరపున మంచినీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.తాగునీటితో పాటు కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లను, అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సకు ఉపయోగపడే మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోమటిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి,వార్డు సభ్యులు సామ లక్ష్మమ్మ, యలమకంటి ప్రమీల, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టేట్ 4వ ర్యాంక్ సాధించిన ఆద్య

**ప్రజాపక్షం/తుంగతుర్తి** :తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతి ప్రవేశ పరీక్షలో మండలంలోని వెంపటి గ్రామానికి చెందిన జాజుగళ్ళ శ్రీనివాస్ కుమార్తె ఆద్య రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించి హకీంపేటలోని క్రీడా పాఠశాలకు ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చదువుకుంటున్న ఆద్య చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించింది. వేలాది మంది విద్యార్థులు పోటీపడిన పరీక్షలో రాష్ట్రంలోనే టాప్4 లో నిలవడంతో ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ చిన్నారిని అభినందించారు.

## ఎమ్మెల్సీ నిధులు మంజూరు కోసం వినతి



**ప్రజాపక్షం/మోటకొండూర్** :ముత్తిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ అభివృద్ధి కొరకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నిధుల నుండి పది లక్షల రూపాయలు మంజూరు చేయాలని ముత్తిరెడ్డిగూడెం సర్పంచ్ బుడిగ బాలరాజు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శిగాదేగాని మాణిక్యం, ముత్తిరెడ్డిగూడెం వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ మారోజు వీరన్న ఆశయాలను సాధిద్దాం



**ప్రజాపక్షం/తుంగతుర్తి** : కామ్రేడ్ మారోజు వీరన్న ఆశయాలను సాదిద్దామని ఆరాధ్య ఫౌండేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీధర్ అన్నారు. శనివారం మారోజు వీరన్న 27వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన ఐక్య ఉద్యమనేత, కులవర్గ పోరాట సిద్ధాంతకర్త, సామాజిక తెలంగాణ రూపకర్త కామ్రేడ్ మారోజు వీరన్న చేసిన పోరాటాలను కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ సయ్యద్, తునికి బద్రి గౌడ్, పుల్లెందుల వెంకన్న, ఊడుగుల ఐలయ్య యాదవ్, బి. సైదులు ముదిరాజ్, మేడబోయిన గంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ట్రాఫిక్ నియంత్రణకై పట్టణంలో అవగాహన ర్యాలి నిర్వహించగా ఆయన మాట్లాడారు. వాహనాదారులు ఫుట్‌పాత్‌పై వాహనాలు నిలపరాదని, అదేవిధంగా చిరు వ్యాపారులు ఫుట్ అవతల షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే షాపులపై జరిమానాలు విధించడ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, సీఐ సోమనర్సయ్య, ఎస్ఐలు రాంబాబు, కృష్ణయ్య, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో పంటలు పండించాలి



**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్:** రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, క్షేత్ర స్థాయి సమస్యలకు పరిష్కారం చూపడం కోసం ప్రొఫసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం శనివారం తిరుమలగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగింది.వ్యవసాయ శాస్త్రవేత్త డా. ఎన్. నళిని మాట్లాడుతూ తక్కువ యూ రియా వాడకం, పంట మార్పిడి విధానం, సమగ్ర పోషక నిర్వహణ, పురుగులుతెగుళ్ల యాజమాన్యం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడినిచ్చే వంగడాలు, శాస్త్రీయ పద్ధతులపై రైతులకు వివరించారు.వ్యవసా య శాస్త్రవేత్త డాక్టర్ జి.స్వాతి మాట్లాడుతూ సాగునీటిని ఆదా చేయాలని,అవసరం మేరకే రసాయనాలు వాడాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి హర్షిత మాట్లాడుతూ నకిలీ విత్తనాల పట్ల రైతు లు అప్రమత్తంగా ఉండాలని, పంట కోతలను కాల్చకుండా నేలలో కలియదున్నాలని తెలిపారు.గ్రామ సర్పంచ్ సలహాదారుడు పగడాల సై దులు యాదవ్ మాట్లాడుతూ శాస్త్రీయ విధానాల్లో ప ంటలు పం డించి అధిక దిగుబడులు పొందాలని కో రారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి స మీర్ పాషా, ఆదర్శ రైతులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వెంకట్రామిరెడ్డికి నివాళులర్పించిన మంత్రి కోమటిరెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/తిప్పర్తి** :మండలం లోని ఉమ్మడి రాజపేటకు రెండు పర్యాయాలు ఎంపీటీసీగా,జొన్నగడ్డలగూడెం సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించి ,రాష్ట్ర శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఉన్న నామిరెడ్డి వెంకట్రామిరెడ్డి అకాల మర ణం తీవ్ర విచారకరం. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆయన పార్థివదేహాని కి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.అనంతరం వారి కు టుంబ సభ్యులను పరామర్శించి,ధైర్యం చె ప్పారు.ఈకష్టసమయంలో వెంకట్రామిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం పార్టీ పరంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలోనల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,పాశం రామ్ రెడ్డి,బొమ్మల మోహన్ రె డ్డి, జూకూరి రమేష్, అబ్బగోని రమేష్, బద్దం రామారావు .బద్దం సుధీర్, పాశం సంపత్ రెడ్డి,ముత్తినేని శా ్యంసుందర్, రొట్టెల రమే ష్, మోష, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీయూలో ఏఐ టూల్స్ అవగాహన



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల నాన్‌టీచిం గ్ సిబ్బంది, పరిపాలనా ఆఫీస్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ వర్క్ కోసం శనివారం ఎంజియులో ఏఐ టూల్స్ అవగాహన శిక్షణా కార్యక్రమాన్నిని కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మాటిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి విభాగాధిపతి డాక్టర్ ఎం.జయంతి అధ్యక్షత వహించగా టాస్క్ నుండి శ్రీ సాయి రాఘవేంద్ర ప్రధాన వక్తగా విచ్చేసి వివిధ రకాల ఏఐ టూల్స్‌ను వివరించారు.ఆధునిక పరిపాలనకు అవసరమైన ఏఐ ఆధారిత కార్యాలయ ఆటోమేషన్, అధికారిక లేఖలు, నివేదికలు, నోటీసుల తయారీ, దత్తాంశ నిర్వహణ, డాక్యుమెంటేషన్, స్మార్ట్ ప్రెజెంటేషన్లు కంటెంట్ సృష్టి, ఇమెయిల్ కమ్యూనికేషన్ వంటి అంశాలపై ఆయన సవివరంగా వివరణ ఇచ్చి ప్రత్యక్ష ప్రదర్శనలు చేశారు. బాధ్యతాయుతంగా, నైతికంగా ఏఐ టూల్స్ వినియోగంపై ఉత్తమ పద్ధతులను వివరించారు. పాల్గొన్న సిబ్బంది సత్వర స్పందనతో ప్రశ్నలు అడిగి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రేఖ, నీలిమ, సునీత, ప్ర గతి, నిర్మల, నాగయ్య, హేమంత్, ఉమా వివిధ వి భాగాల బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సుతో విస్తృత ప్రయోజనాలు :ప్రొఫసర్ బెల్లి యాదయ్య



**ప్రజాపక్షం/నకిరేకల్:** కృత్రిమ మేధస్సు ద్వారా వివిధ రంగాల్లో నవకల్పనలు సాధ్యమవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫసర్ బెల్లి యాదయ్య అన్నారు.విద్యావారోత్సవాల్లో భాగంగా శనివారం కళాశాలలో నిర్వహించిన కృత్రిమమేధస్సునవకల్పనోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.విద్య,వైద్యం,వాణిజ్యం,టెక్నాలజీ రంగాల్లో ఏఐ విస్తృతంగా ఉపయోగపడుతోందని, అభివృద్ధి చెందిన దేశాలు ఈ రంగంలో ముందంజలో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఏఐపై అవగాహన పెంపొందించుకుని వినూత్న ప్రయోగాలు చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఫిజిక్స్ సహాచార్యులు జి.శ్రీనివాస్ అనుసంధానకర్తగా వ్యవహరించగా, వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసాచారి, హరిత,డాక్టర్ శంకర్, ఉపేందర్, శివశంకర్, రవీందర్, నర్సింహాచారి, సుభాషిణి, సుదర్శన్, కార్తీక్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య

ఎం.డి సలీంషరీఫ్




**ప్రజాపక్షం/కోదాడ** :ప్రభుత్వ బడులలో నాణ్యమైన ఉచిత విద్యను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ఎం.డి సలీంషరీఫ్ అన్నారు. శనివారం కోదాడ బాలికల ఉన్నత పాఠశాల అధ్వర్యంలో బడిబాట ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో 500పై మార్కులు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మానించి ప్రదాన రహదారిపై నిర్వహించిన ర్యాలీ పట్టణ వాసులను ఆరించింది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి. సుశీలాభాయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డెంగీ నివారణ మన చేతుల్లోనే ఉంది




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** :డెంగ్యూ వ్యాధి నివారణ మన చేతుల్లోనే ఉంటుందని, శుభ్రత పరిశుభ్రతతోనే డెంగ్యూను నివారించవచ్చని కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ అన్నారు. శనివారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నివారణ, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పి డాక్టర్ చందన్, పిహెచ్ఎన్ పద్మ, సూపర్‌వైజర్ పద్మ, ఆరోగ్య సిబ్బంది రత్నమేరి, శివకుమార్, సంతోషి, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో అల్పాహారం పంపిణీ




**ప్రజాపక్షం/నకిరేకల్** :ఫ్రీమీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ లయన్స్ క్లబ్, ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిసిలు ఎర్ర శంభు లింగారెడ్డి,ఎన్ రామ్మోహన్ రావు, క్లబ్ అధ్యక్షుడు,దాత రేపాల సతీష్, ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ వుప్పల సంతోష్ కుమార్ క్లబ్ కార్యదర్శి సూర్య చంద్రావు కోశాధికారి అండెం వెంకన్న,ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షులు మారుపాక నరసయ్య,కార్యదర్శి బాణాల రామ్ రెడ్డి,ఉపాధ్యక్షులు కప్పల యాదయ్య,తాటికొండ కృష్ణారెడ్డి, కోశాధికారి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,కార్యదర్శి వంటేపాక సోమేశ్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

**ప్రజాపక్షం/నడిగూడెం** : మండలంలోని సిరిపురం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని కార్యదర్శి ఆర్. సతీష్ కుమార్ తెలిపారు. ఎండతీవ్రత దృష్ట్యా కార్మికులు ఉదయం 7 గంటలకే పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె. రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ జంపాల వెంకన్న, కూలీలు పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాలు సిద్ధం

- పక్కదారిపట్టకుండా బార్‌కోడ్
- మొత్తం కావాల్సిన పుస్తకాలు 505294
- ఇప్పటి వరకు చేరుకున్న పుస్తకాలు 449157
- సర్కారు చదువుల బలోపేతానికి కృషి
- జూన్ 12 నుండి బడులు పునఃప్రారంభం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేద విద్యార్థుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యాసం. ప్రారంభిస్తుండగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే పాఠ్యపుస్తకాలు జిల్లా విద్యాశాఖ గోదాముకు 89 శాతం వరకు చేరుకున్నాయి. విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు అక్షరాస్యతా శాతాన్ని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలతో పాటు ఏకరూ పదుస్తులు, మధ్యాహ్నభోజనం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 202627 విద్యా సం.కు గానూ జూన్ 12 నుండి బడులు తెరిచిన వెంటనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు విద్యా యంత్రాగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే జిల్లాకు 449157 పుస్తకాలు చేరుకున్నాయి.

### 505294 పుస్తకాలు అవసరం...

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల పరిధిలో అన్ని రకాల తరగతులకు చెందిన సుమారు 70 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మొత్తంగా 505294 పుస్తకాలు అవసరం ఉంటాయని గుర్తించిన అధికారులు నివేదికలు ప్రభుత్వానికి పంపడంతో ఇప్పటికే 449157 పుస్తకాలు జిలాల్లా కేంద్రానికి చేరుకున్నాయి. వీటిని మండల కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా 56137 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. పుస్తకాలతో పాటు విద్యార్థులకు నోట్ పుస్తకాలను కూడా జూన్ 12వ తేదిన బడులు తెరవంగానే అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### దారిమళ్లకుండా ...

ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ఖచ్చితమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పాఠ్యపుస్తకాలపై సీరియల్ నెంబర్లు ముద్రించడంతో పాటు బార్‌కోడ్ వేస్తున్నారు. తద్వారా జిలాల్లో ఎన్ని పుస్తకాలు ఏఏ పుస్తకాలు చేరుకున్నాయో ఇట్టే తెలిసిపోతుంది. అంతే కాకుండా విద్యార్థులకు పంపిణీ చేసే సమయంలో కూడా అధికారులు పాఠ్యపుస్తకాలపై ఉన్న నెంబర్లను విద్యార్థుల పేర్ల వారీగా నమోదు చేయనున్నారు. అంతే కాకుండా పుస్తకాల దుర్వినియోగాన్ని నివారించేందుకు ప్రభుత్వం విజిలెన్స్ కమిటీలను కూడా ఏర్పాటు చేయనుంది.

# మహనీయుడా.. మన్నించయ్యా..!

-విగ్రహ ఏర్పాటులోవున్న శ్రద్ధ భద్రపరచడంలో లేకపాయే..?
-అవమానకరంగా దర్శనమిస్తున్న అంబేద్కర్ విగ్రహం





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహనీయుడిని దేశమంతా ఘనంగా స్మరించుకుంటోంది. అంబేద్కర్ ప్రతి భారతీయునికి గర్వకారణం. దానికి తగ్గట్లుగా ప్రజలు ఆయనను అర్థం చేసుకున్నారా.? రిజర్వే షన్ల ప్రదాతగానే ఎందుకు గుర్తిస్తున్నారు..? దళిత ఐకాన్ మాత్రమే ఎందుకు పరగణిస్తున్నారు..? అణగారిన వర్గాలకు ఇచ్చిన స్ఫూర్తి అందడం లేదా...? దేశానికి అంబేద్కర్ చూపించిన మార్గంలో నడుస్తున్న వారెంత మంది.? దేశ విదేశాల హితం కోసం అంబేద్కర్ చేసిన ప్రయత్నాలు. ఇప్పుడు రాజకీయ పార్టీల కబంధ హస్తాల్లో చిక్కి పోయాయి. దళితులను ఇంకా ఇంకా వేరుచేస్తూనే పోతున్నాయి. మారుతున్న కాలంతో పాటే మారుతున్న భావజాలం కూడా ఈ పరి స్థితిని మరింత విషమం చేస్తోంది కానీ మెరుగు పరచడం లేదు. రోజు రోజుకీ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటులో అభిమానమో.? లేక రాజకీ యమో.? జూలూరుపాడు మండల కేంద్రంలోని చంద్రుగొండ చౌరాస్తాలో ఏర్పాటు చేసిన రెండు విగ్రహాల మధ్య నేల మీద దీనంగా కనిపిస్తున్న మహనీయుడి మరో విగ్రహన్ని చుసిన వారు మహనీయుడా మన్నించండయ్యా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రాత్రికి రాత్రే వెలసిన రెండు అంబేద్కర్ విగ్రహాలు...

గత నాలుగు సంవత్సరాల క్రితం కొంత మంది దళిత యువకులు, అధికారులకు, నాయకులకు, ప్రజా ప్రజాప్రతినిధులకు దరఖాస్తులు రూపంలో పత్రికా ప్రకటనల ద్వారా వేడుకొని 2022, ఫిబ్రవరి 13, బుధవారం అర్ధ రాత్రి అంబేద్కర్ యువసేన నాయకులు, బిఎస్పీ దళిత నాకులు, కాంగ్రెస్ దళిత నాయకులు. లంతా కలసి, చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద డివైడర్ పై, అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు జరిపారు. ఇట్టి విషయం తెలుసుకున్న, మరో దళిత వర్గం, ఎంఆర్పిఎస్, తెరాస పార్టీ దళిత వర్గ నాయకులంతా కలిసి, నడిరోడ్డుపై, మరో అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్లు చేశారు. ఈ తతంగమంతా భద్రాద్రి కొత్తగూడెంజిల్లా జూలూరుపాడు మండల కేద్రంలో చంద్రుగొండ క్రాస్‌రోడ్డు నందు, రాత్రికి రాత్రే రెండు విగ్రహలు ఒకే చోట ఏర్పాటు చేయడంతో వర్గ పోరులో రెండు విగ్రహాలు అవసరమా అని ఆనాడు గుగుసలాడారు.



### నూతన విగ్రహ ఏర్పాటులో వున్న శ్రద్ధ, భద్రపరచడంలో లేదు...?

గత 2022, ఫిబ్రవరి 13, బుధవారం అర్ధరాత్రి నడి రోడ్డుపై ఏర్పాటు చేసిన విగ్రహం లారీ ప్రమాదంలో స్వల్పంగా దెబ్బతినగా, లారీ యాజమాన్యం నూతన విగ్రహ ఏర్పాటుకు నష్ట పరిహారం చెల్లించగా ఓ దళిత నాయకుడు పాత విగ్రహాన్ని పక్కన పెట్టి. మరో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేతులు మీదుగా నూతన విగ్రహ ఆవిష్కరణ మండల కేంద్రంలో జరిపించగా, మరో దళిత వర్గం అంబేద్కర్ మహనీయుని జయంతి సందర్భంగా దళిత నాయకులు ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు జరుకోవడాన్ని చూసిన కొంతమంది ప్రజలు, ఇంత అభిమానం చూపిస్తున్న దళిత నాయకులు. నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో చూపించిన శ్రద్ధ, లారీ ప్రమాదంలో దెబ్బ తిన్న పాత విగ్రహాన్ని భద్రపరచకుండా ప్రధాన రహదారి, ప్రధాన సెంటర్ రోడ్డు పక్కనే పడేసి చేతులు దులుపు కుంటే నూతన విగ్రహం ఏర్పాటు లో వున్న శ్రద్ధ పాత విగ్రహం భద్రపరచడంలో ఎందుకు లేదు అనే విమర్శలు వినబడుతూ, మహనీయుడా మన్నించండి అని, విగ్రహాన్ని ప్రజలు వేడుకుంటున్నారు.

# సిపిఐ బలోపేతానికి కృషి చేయాలి

-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



**ప్రజాపక్షం/అశ్వాపురం:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శనివారం అశ్వాపురంలోని సిపిఐ కార్యాలయంలో మండల, పట్టణ కార్యవర్గ సమావేశం ఈనపల్లి పవన్ సాయి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. ఒకప్పుడు ఎంఎల్‌ఏలు, ఎంపీలు, జెడ్‌పిటిసిలు, ఎంపీపీలు గెలిపించిన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్‌పిటిసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. రైతులు పండించిన వడ్లను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని, సహకార ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మి కుమారి, అనంతనేని సురేష్, వేల్పుల మల్లికార్జున్, రాయపూడి రాజేష్, మేలపురం సురేందర్‌రెడ్డి, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, పగిడిపల్లి జంపయ్య, దంతాల జగదీష్, కమటం వీరన్న, ఎడెల్లి కమలాకర్, బండ్ల తిరుపతయ్య, కంచర్ల రవి, కల్లూరు నరసింహారావు, ఇరుగు శ్రీకాంత్, చిలుకాని శ్రీనివాస్, మర్రి నాగరాజు, దండి నాగేష్, మిత్తుల జీఆర్, సబ్కా అజయ్, బడేటి ప్రవీణ్, ముత్తబోయిన వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# నాకు ప్రచారం అవసరం లేదు

-పైలాన్ నిర్మాణాన్ని తొలగించండి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాజకీయంగా తనకు ఎటువంటి ప్రచారం అవసరం లేదని ఖమ్మంలో నిర్మిస్తున్న పైలాన్ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి సంబంధించి ఇటీవల కొంత మంది నాయకులు పైలాన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పైలాన్ నిర్మాణం పివి నర్సింహారావు విగ్రహం వద్ద ఏర్పాటు చేస్తుండడంతో వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్‌కు పైలాన్ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. పైలాన్ నిర్మాణ విషయం తనకు తెలియదని కొంత మంది కార్యకర్తలు అత్యుత్సాహంతో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. మాజీ ప్రధాని పివి నర్సింహారావు వంటి మహోన్నత వ్యక్తిని కించపరిచేవిధంగా ఎలాంటి చర్యలు ఉండ కూడదని మంత్రి స్పష్టం చేశారు. కార్యకర్తలు ప్రచార ఆర్భాటాల కంటే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై దృష్టి సారించాలని సూచించారు.

# ప్రతిపాదనలు సమర్పించాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** జన్ భాగీదారీ సబ్సేదూర్, సబ్సే హేపలే కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు ఈ నెల 18 నుండి 25 వరకు బ్లాక్ లెవల్ మాస్టర్ ట్రైనింగ్ ప్రోగ్రాముల నర్వహణకు ప్రజల ప్రతిస్పందన వివరాలు సంబంధిత ప్రతిపానలు రూపొందించి సమర్పించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత ఎంపిడిఓలను ఆదేశించారు. శనివారం ఐటిడిఏ సమావేశ మందిరం నుండి టెలీకాన్ఫిరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి జన్ధాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్, దర్తీ ఆబాజెన్ జాతీ గ్రామ ఉత్కర్ష అబియాన్ పరిధిలోకి వచ్చే అన్ని గ్రామాలలోజన్ భాగీదారీ సబ్సేదూర్, సబ్సే హెపలే కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేలా సంబంధిత ఎంపిడిఓలు ప్రత్యేక చొరవచూపాలన్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించి అందించాలని ఆదేశించారు.

# ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** రోగులకు అవసరమైన మందులను విక్రయించే విధానంలో ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలని కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు సోమశేఖర్ డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్త బంద్‌ను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని జీయర్ మఠంలో బంద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఫార్మా రంగాన్ని ప్రభావితం చేస్తున్న పలు సమస్యలపై ఇప్పటికే విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ ఫార్మసీవిక్రయాల ద్వారా ప్రజారోగ్యానికి ముప్పు అందని ఆవేదన వ్యక్తం చేశారు. అధునిక సాంకేతికతను అడ్డు పెట్టుకుని నకిలీ ప్రిస్క్రిప్షన్ల ద్వారా ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు పొంచి ఉందన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలంటూ కోరినా స్పందన లేకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యదర్శి చల్లగుళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మెడికల్ షాపుల యజమానుల సమస్యలపై ఈనెల 20న జరిగే దేశవ్యాప్తం బంద్‌లో భాగంగా భద్రాచలంలో కూడా జరిగే బంద్‌ను జయప్రథం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాపుల యజమానులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

